క్లుప్తంగా

శనీశ్వరుడికి తైలాభిషేకాలు

సింహాచలం: శనిత్రయోదశి పురస్కరించుకుని శనివారం విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలోని శనీశ్వరుడికి భక్తులు విశేషంగా తైలాభిషేకాలు నిర్వహించారు. శనిదోష నివారణ పూజలు ఆచరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ తదితరులు పూజలు నిర్వహించారు.

ప్రసాద వితరణ



పులిహోర ప్రసాదం భక్తులకు అందజేస్తున్న ఎస్‌వీఎల్‌ఎన్ యూత్ ఫ్రెండ్స్

సింహాచలం: సింహగిరి ఘాట్‌రోడ్డు ప్రాంతానికి చెందిన ఎస్‌వీఎల్‌ఎన్ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సింహగిరి మెట్ల మార్గంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దిలీప్‌రెడ్డి, మధురెడ్డి, రోహిత్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేష్, బాబులాల్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పరవాడ: మడకపాలెం సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సీఐ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.65 వేల నగదు స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

కోడి పందాలపై ..

ఈ.మర్రిపాలెం గ్రామ సమీపంలోని జీడి తోటల్లో శనివారం ఉదయం కోడి పందాలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ ఈశ్వరరావు తన సిబ్బందితో దాడులు జరిపారు. ఈ దాడుల్లో కోడి పందాలు ఆడుతున్న 6 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2300 నగదు, 4 కోడి పుంజులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

బీజేపీ ఎన్నికల కార్యాలయాలు ప్రారంభం

సింహాచలం: ఎమ్మెల్సీ ఎన్నికలు పురస్కరించుకుని 96వవార్డు పరిధి పెందుర్తి, 94వవార్డు పరిధి వేపగుంట, 95వవార్డు పరిధి లక్ష్మీపురంలో బీజేపీ ఎన్నికల కార్యాలయాలను ఆ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు పాల్గొన్నారు.

'ట్రస్ట్‌బోర్డు సమావేశం నిర్వహించాలి'

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏప్రిల్‌లో జరిగే స్వామివారి కల్యాణోత్సవం, చందనోత్సవం ఏర్పాట్లపై చర్చించడానికి సమావేశం నిర్వహించాలని ఈవో త్రినాథరావును ట్రస్ట్‌బోర్డు సభ్యులు కోరారు. ఈ నెల 23, 27 తేదీల్లో లేదా మార్చి1వతేదీల్లో ఏదో ఒకరోజు ట్రస్ట్‌బోర్డు సమావేశం నిర్వహించాలని శనివారం ట్రస్ట్ బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. ప్రధాన ఉత్సవాలైన కల్యాణోత్సవం, చందనోత్సవానికి సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన పనులపై చర్చించేందుకు ట్రస్ట్‌బోర్డు సమావేశం ఏర్పాటు అవశ్యమని తెలిపారు.

సేవలోనే సంతృప్తి



సరస్వతికి చెక్కు అందిస్తున్న విజయకుమార్, స్టీఫెన్ ప్రసాద్

సబ్బవరం: అనాథలు, పేదలకు ఆపన్న హస్తం అందజేయనున్నట్టు రావలమ్మపాలెం గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చి ఫాస్టర్ పి. విజయకుమార్ చెప్పారు. చర్చిలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా మండలంలోని నిరుపేదలు, ఒంటరి మహిళలు,వృద్ధులు,దివ్యాంగుల కనీస అవసరాలు తీర్చేందుకు సహాయ సహకారాలు అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాదంలో కాళ్లు విరిగిపోయిన కోన సరస్వతితో పాటు వితంతువు కోమూజి సరస్వతికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పాస్టర్ స్టీఫెన్ ప్రసాద్ , ఫాస్టర్ డేవిడ్ లివింగ్‌స్టన్ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ .. శంభో శంకర



పెదయాతపాలెంలో ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీ పరమేశ్వరుల చెంత భక్తులు

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- పరమశివుడికి విశేష అభిషేకాలు, అర్చనలు

పరవాడ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెందుర్తి నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు శనివారం భక్తులతో కళకళలాడాయి. హరనామస్మరణతో మార్మోగాయి. పరమశివుడిని భక్తితో కొలిచారు. విశేష అర్చనలు , అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీలు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాయి.

పరవాడ మండల పరిధిలో..

పరవాడలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామిని దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. మహాశివుడిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

- ఎన్టీపీసీ దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో కొలువుదీరిన పరమశివుడిని దర్శించుకునేందుకు వాడచీపురుపల్లి, గొల్లపేట, దళాయిపాలెం, సునపర్తి, పోలిపల్లి కూడలి, పందివానిపాలెం, గొరుసువానిపాలెం గ్రామాల ప్రజలు తరలివచ్చారు.
- తాడి గ్రామంలో కొలువైన శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామిని లంకెలపాలెం, తాడి, తానాం, ఈ.బోనంగి, బొద్దపువానిపాలెం గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గౌతులచ్చన్ననగర్‌లో సద్గురు పాదుకా క్షేత్రంలో శ్రీ షిర్డీ సాయి సేవా ట్రస్టు చైర్మన్ వి.పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో శివపారాయణ కథా కాలక్షేపం నిర్వహించారు. కార్యక్రమంలో పైల రామారావు, జెర్రిపోతుల అప్పారావు, పి.జోగినాయుడు పాల్గొన్నారు.
- భర్నికం, నాయుడుపాలెం, లేమర్తి గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.



సింహగిరిపై కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



దేవీపురంలోని పంచభూతలింగేశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సింహాచలం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శనివారం శివనాస్మరణతో శివాలయాలు హోరెత్తాయి. భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పరమేశ్వరుడిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సింహగిరి క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్న త్రిపురాంతకస్వామి ఆలయంలో శైవాగమం ప్రకారం తెల్లవారుజామున 4గంటల నుంచి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రమణమూర్తి ఆధ్వర్యంలో రాత్రి 9.30 నుంచి రుద్రాభిషేకం, లింగోద్భవ పూజలు చేశారు.

- సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకుడు మంథా సుబ్బారావుశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.
- జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని పాత అడవివరం, కాపుదిబ్బ, విజినిగిరిపాలెం, ప్రియాగార్డెన్స్‌లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.
- 93వ వార్డు ప్రహ్లాదపురంలోని ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో శనేశ్వరస్వామికి తైలాభిషేకం, సాయంత్రం 6 నుంచి శనీశ్వర హోమం, రుద్రహోమం, రాత్రి 12గంటలకు లింగోద్భవ పూజలు విశేషంగా నిర్వహించారు.
- జీవీఎంసీ 97వ వార్డుచినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, వెంకటాద్రి ఘాట్‌రోడ్డులోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, పినగాడిలోని చోడేశ్వరస్వామి ఆలయం, సుజాతానగర్‌లోని కేదారేశ్వరస్వామి ఆలయంలో, ప్రశాంతినగర్ స్వయంభూ మల్లేశ్వరస్వామి, సరిపల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయంతో పాటుట వేపగుంటలోని ఈశ్వర ఆలయం భక్తులతో కిక్కిరిశాయి.



పెందుర్తి ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సబ్బవరం: లింగాలతిరుగుడులోని స్వయంభూ సోమలింగేశ్వరస్వామి ఆలయం, ఇరువాడలోని స్వయంభూ భీమలింగేశ్వరస్వామి ఆలయం,వంగలిలోని స్వయంభూ సోమలింగేశ్వరస్వామి ఆలయం,సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం,పెదయాతపాలెంలోని ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీపరమేశ్వరుల క్షేత్రం,దేవీపురంలోని దక్షవాటిలో కొలువైన పంచభూత లింగేశ్వరుని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు.



విజినిగిరిపాలెం ఉమాచంద్రమౌళేశ్వరస్వామి



మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



దీపాంజలినగర్ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గౌతులచ్చన్ననగర్‌లో సద్గురు పాదుక క్షేత్రంలో శివపారాయణ వింటున్న భక్తులు



పరవాడ శివాలయంలో అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు



వేపగుంటలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక చిత్రప్రదర్శన



విజినిగిరిపాలెం ఉమాచంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ముత్యాలమ్మపాలెం తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు



తీరంలో కొలువుదీరిన మహాశివుడు



పుణ్యస్నానాలు చేయడానికి అనువైన ముత్యాలమ్మపాలెం తీరం

పరవాడ: జాగరణ చేసే భక్తులు ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వీలుగా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆదివారం వేకువజాము నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చే వేలాది భక్తులు తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలో కొలువుదీరిన మహాశివుడిని దర్శించుకుంటారు. శివరాత్రి పురస్కరించుకొని ముత్యాలమ్మపాలెం తీరంలో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం బుర్రకథ, రేలారేలారే వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటి పానీయాలు అందించడానికి పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు పర్యవేక్షణలో ఇద్దరు ఎస్ఐలు, 30 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. స్నానాలు ఆచరించడానికి తరలివచ్చే భక్తులు గ్రామం మీదుగా కాకుండా సచివాలయం ఎదురుగా ఉన్న రహదారి మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించడానికి చర్యలు చేపట్టామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు దగ్గుపాటి పురందేశ్వరి దంపతులు, ఆంధ్రప్రదేశ్ లీగల్ మెట్రాలజీ మరియు రోడ్డు సేఫ్టీ డీజీ కేఆర్ఎం కిషోర్‌కుమార్ దంపతులు, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్‌కుమార్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం అధికారులు అందజేశారు.



అప్పన్న ఆలయంలో ఆర్‌బీఐ ఈడీ అజయ్‌కుమార్



మొక్కుకుంటున్న పురందేశ్వరి దంపతులు



అప్పన్న సన్నిధిలో డీజీ కిషోర్‌కుమార్ దంపతులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శివపార్వతుల వార్షిక కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం రాత్రి 12 నుంచి లింగోద్భవ పూజలు నిర్వహించారు. నక్షత్రహారతి అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సీవీఆర్ మూర్తి, చలపతిరావు, అప్పలనాయుడు, రామారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



విద్యార్థులకు ట్రోఫీతో పాటు బహుమతులు అందజేస్తున్న బాబూరావు తదితరులు

సబ్బవరం: తల్లిదండ్రులు లేని చిన్నారులతో పాటు ఎంతో మంది పేద పిల్లలను అక్కున చేర్చుకుని ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు డాన్ బోస్కో నవజీవన్ సొసైటీ కృషి చేస్తుందని అనకాపల్లి జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు భర్ణికాన బాబూరావు అన్నారు. దేవీపురంలోని డాన్ బోస్కో నవజీవన్ సొసైటీలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు శనివారం బహుమతులు పంపిణీ చేశారు. ఎరునాయుడుపాలెం జట్టుకు ట్రోఫీతో పాటు రూ.3 వేలు, రెండో స్థానంలో నిలిచిన డాన్ బోస్కో నవజీవన్ సొసైటీ విద్యార్థులకు ట్రోఫీతో పాటు రూ.2 వేలు,ప్రశంసా పత్రాలు అందజేశారు. నారపాడు సర్పంచ్ మామిడి శంకరరావు, అసకపల్లి సర్పంచ్ కర్రి నరసింగరావు,ఫాదర్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్ నిర్మాణం కోసం పరిశీలన



పరిశీలన చేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఈఈ శ్రీనివాసరాజు

సింహాచలం: సింహగిరిపై దాతల సహకారంతో శాశ్వతంగా భారీ షెడ్ ఏర్పాటు చేయడానికి శనివారం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఈఈ శ్రీనివాసరాజు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నృసింహ మండపంతో పాటు తూర్పు మాడ వీధిలో పర్యటించారు. నృసింహ మండపంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో భారీ షెడ్ నిర్మాణానికి ఇటీవల లారస్ ల్యాబ్స్ ముందుకు వచ్చింది. ఈ విషయంపై ఈఈ, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీదేవి తదితరులతో కలిసి నృసింహ మండపంలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. తూర్పు మాడవీధిలోనే షెడ్ నిర్మిస్తే బాగుంటుందని, ఈ విషయాన్ని దాతలకు వివరించి వారి సమ్మతి తీసుకోవాలని ట్రస్ట్‌బోర్డు సభ్యులు సూచించారు.

మహిళపై దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

పీఎం పాలెం: మహిళపై దాడి చేసి గాయపరచిన కేసులో ఒకరికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 6వ వార్డు పరిధి కొమ్మాది అమరావతి కాలనీకి చెందిన ఉప్పాడ లక్ష్మిపై ఒడిశా రాష్ట్రానికి చెందిన సయ్యద్ రఫీ అక్టోబర్ 5, 2020న కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితురాలు పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రవికుమార్ హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి ఎస్ఐ సీహార్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. విచారణ జరిపిన అనకాపల్లి అడిషనల్ అసిస్టెంట్ జడ్జి నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారని సీఐ రామకృష్ణ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు



సీఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న విశ్వనాథరాజు, రఘు నాయక్,వెంకటరమణ, శ్రీనివాసరావు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 96 మంది ఉద్యోగులకు యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులను అందజేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, క్షమశిక్షణ కలిగిన ఉద్యోగులకు ఏటా ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందజేస్తోంది. ఇందులో భాగంగా శనివారం ఉక్కునగరం ఎంపీ హాలులో స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ చేతులు మీదుగా 49 మంది అధికారులు, 49 మంది కార్మికులకు అవార్డులను అందజేశారు. అదే విధంగా ప్రతిభ చూపిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి కమెండేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు వీవీ వేణుగోపాలరావు, డీకే మహంతి, బాగ్చీతో పాటు పలువురు ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ విద్యా విధానం దేశానికే ఆదర్శం



డైట్ కాలేజీలో ఢిల్లీ విద్యాధికారుల బృందం

భీమునిపట్నం: మన రాష్ట్రంలోని విద్యా విధానం దేశానికే ఎంతో ఆదర్శంగా ఉందని ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి అన్నారు. ఢిల్లీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు చెందిన విద్యాధికారుల బృందం శనివారం ఇక్కడి జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్), కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి బృందాలు సందర్శించడం వల్ల పరస్పరం విద్యా విధానం గురించి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడి ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తోందని, అందులో భాగంగా వారికి నాణ్యమైన విద్యతోపాటు, అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఢిల్లీ విద్యాధికారులు శ్రీరామ్‌కిశోర్, రుసు చౌదరి, సునీత మిట్టల్, ఇరత సభ్యులకు బోధన విధానాలను వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా కొణతాల

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల వెంకట అప్పారావు కాంగ్రెస్ తరఫున బరిలో దిగుతున్నారు. పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో తీర్మానించారు.

22న ప్రపంచ స్కౌట్ థింకింగ్ డే

మద్దిలపాలెం: స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న స్కౌట్ థింకింగ్ డే నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కమిషనర్ సరవ ప్రకాశరావు తెలిపారు. ప్రపంచ స్కౌట్ ఉద్యమ నిర్మాత బాడెన్ పావెల్ 1857 ఫిబ్రవరి 22న లండన్‌లో జన్మించారన్నారు. ఆయన జయంతి రోజున ప్రపంచ స్కౌట్ అండ్ గైడ్స్ దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 22, 23 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు పలు అంశాలపై పోటీలు ఏర్పాటు చేశామన్నారు. బీహెచ్‌పీవీ మార్గంలోని సంసిదా ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఘనంగా ఆంజనేయస్వామి పరస

సింహాచలం: వేపగుంటలో ఆంజనేయస్వామి పరసత్సవం శనివారం ఘనంగా జరిగింది. స్వామికి తమలపాకులు, సింధూరపూజ చేశారు. విశాఖ గౌరీసేవా సంఘం అధ్యక్షుడు బుద్ధా శివాజీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తదితరులు భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.

బొండవానిపాలెంలో..

సబ్బవరం: మండలంలోని గొటివాడ శివారు బొండవానిపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థమహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్నవారిలో గ్రామ పెద్దలు లగిశెట్టి కుమార్, బొండా శ్రీను ఉన్నారు.